సాక్షి
కాకినాడ

శనివారం | 11 | నవంబర్ | 2023



రూ.1.40 లక్షల విరాళం

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో నిత్యాన్నదాన పథకానికి ఓజీ రవితేజారెడ్డి (కడప) శుక్రవారం రూ.1,40,000 విరాళం సమర్పించారు.



ఘనంగా మహాశాంతి హోమం

కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి దివ్య క్షేత్రంలో శ్రీదేవి, భూదేవీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి.

II లో

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: డెల్టా కాలువలకు శుక్రవారం 5,200 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 1,000, మధ్య డెల్టాకు 1,200, పశ్చిమ డెల్టాకు 3,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

దిగుబడుల దీపావళి

- రైతు కళ్లలో ఆనందకాంతులు
- ఖరీఫ్‌లో సానుకూల పరిస్థితులు
- కలిసొచ్చిన ధాన్యం దిగుబడులు
- ఎకరానికి 35 నుంచి 40 బస్తాలు



సామర్లకోట మండలం జి.మేడపాడులో ధాన్యాన్ని రాశులుగా పోస్తున్న రైతులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: రైతు కుటుంబాల్లో దీపావళి వెలుగుల జోష్ కనిపిస్తోంది. ఖరీఫ్ దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో రైతుల్లో సంతోషం వెల్లివిరుస్తోంది. వర్షాభావ పరిస్థితులను ప్రభుత్వ ప్రోత్సాహంతో అధిగమించారు. సాగు నీరు, విత్తనాలు, ఎరువులను ప్రభుత్వ యంత్రాంగం సకాలంలో అందించడం ఈసారి రైతులకు బాగా కలిసి వచ్చింది. సీజన్ ప్రారంభంలో కొంత ప్రతికూల వాతావరణం కనిపించినా చివరిలో దిగుబడులు ఆశాజనకంగా ఉండటం ఊరటనిచ్చింది. ప్రస్తుతం రైతులు మాసూళ్లలో బిజీగా ఉన్నారు. చేతికంది వచ్చిన పంటను కళ్లాల్లోనే మద్దతు ధరకు అమ్మేస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఇటు మెట్ట, అటు డెల్టా అనే తేడా లేకుండా ముందుగా ఊడ్పులు జరిగిన ప్రాంతాల్లో వ్యవసాయ పనులతో సందడి వాతావరణం కనిపిస్తోంది.

కోతలు వేగంగా పూర్తి

ఏటా మాదిరిగానే మెట్ట ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు కొంత ఇబ్బంది కలిగించాయి. అయినా గోదావరి మధ్య, తూర్పు డెల్టాల పరిధిలోని ఆయకట్టు, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లోని మెట్ట ప్రాంత మండలాల్లో ఖరీఫ్ దిగుబడులు ఆశాజనకంగా వస్తున్నాయి. కాకినాడ రూరల్, కరప, సామర్లకోట, పెద్దాపురం, జగ్గంపేట, గోకవరం, గండేపల్లి, ముమ్మిడివరం, కొత్తపేట, మండపేట, రాజమహేంద్రవరం రూరల్, కడియం, అనపర్తి, రాజానగరం, కొవ్వూరు తదితర మండలాల్లో వరి నూర్పిళ్లు వేగంగా జరుగుతున్నాయి. రాజమహేంద్రవరం రూరల్‌లో 50 శాతం పైగా కోతలు పూర్తయ్యాయి. రాజానగరం, అనపర్తి, సీతానగరం, కొవ్వూరు, చాగల్లు మండలాల్లో వరి మాసూళ్లు నాలుగైదు రోజులుగా ముమ్మరంగా సాగుతున్నాయి. కోతలు పూర్తి చేసిన రైతులు ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టి అటు నుంచి అటే రైతు భరోసా కేంద్రాలకు తరలిస్తున్నారు. మద్దతు ధరకు అమ్ముకుంటున్నారు. గత ఏడాది ఇదే సీజన్‌లో మద్దతు ధర 75 కిలోల బస్తా రూ.1,530. దీనిని రాష్ట్ర ప్రభుత్వం ఈ సీజన్‌లో రూ.1,637కు పెంచడంతో గొప్ప మేలు జరుగుతోందని రైతులు సంబరపడుతున్నారు.

ఇక్కడ దీపావళి సెంటిమెంటు

ఖరీఫ్‌లో ముందుగా నాట్లు వేసే మండపేట, రామచంద్రపురం, కొత్తపేట నియోజకవర్గాల్లో ఇప్పటికే వరి కోతలు మొదలయ్యాయి. ఈ మండలాలతో సెంట్రల్ డెల్టాలో రైతులు దీపావళి సెంటిమెంట్‌తో వచ్చే బుధవారం నుంచి మాసూళ్లు ముమ్మరం చేస్తారంటున్నారు. దిగుబడులు బాగుండటం వారికి ఊరటనిస్తోంది. బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో ప్రతికూల రైతులను ఆందోళనకు గురిచేస్తున్నా మాసూళ్లకు ధైర్యంగా సిద్ధపడుతున్నారు. వారం పది రోజులు వాతావరణం అనుకూలిస్తే తొలకరి గట్టెక్కుతుందని ఆశ పడుతున్నారు.

పంట కోత ప్రయోగాల లెక్కలు

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో క్షేత్ర స్థాయిలో ఇంతవరకూ జరిగిన 180 పంట కోతల ప్రయోగాలు పరిశీలిస్తే ఎకరాకు 35 నుంచి 38 బస్తాల వరకూ దిగుబడి వస్తోందని లెక్కలేశారు. కొన్ని పొలాల్లో 40 బస్తాలు వచ్చే అవకాశముంది. ఈ దిగుబడులు చూసి రైతులు ఆనందపడుతున్నారు. నాట్ల నుంచి మాసూళ్ల వరకూ ఎకరాకు రూ.26,000 నుంచి రూ.28,000 వరకూ పెట్టుబడులు అయ్యాయి. తెగుళ్ల బెడద తక్కువ, వాతావరణం అనుకూలించడంతో దిగుబడి ఆశాజనకంగా ఉంది. 60 శాతం సాగు కౌలు రైతుల చేతుల్లోనే ఉంది. వీరు ఎకరాకు 12, 15 బస్తాలు వంతున కౌలుకు తీసుకున్నారు. కౌలు, పెట్టుబడులు పోను అంటే ఎకరాకు రూ.30 వేలు కొద్దిగా అటుఇటుగా ఆదాయం రావడం ఆనందంగా ఉందంటున్నారు.

వరి సాగు (ఎకరాల్లో), దిగుబడి, సేకరణ లక్ష్యం (మెట్రిక్ టన్నుల్లో)



జిల్లా	సాగు విస్తీర్ణం	దిగుబడి	సేకరణ లక్ష్యం
కాకినాడ	1,83,000	5,50,000	2,60,000
తూర్పు గోదావరి	70,877	4,50,000	3,20,000
కోనసీమ	1.58,000	4.10,000	3,81,000

కలిసొచ్చిన వాతావరణం



వాతావరణం అనుకూలించడం కలిసొచ్చింది. మునుపటి కంటే తెగుళ్లు బాగా తగ్గాయి. పెట్టుబడులు పెరిగినా పంట బాగా పండింది. గత ఖరీఫ్ సీజన్‌తో పోలిస్తే దిగుబడి బాగా పెరిగింది. ఎకరాకు 35 నుంచి 40 బస్తాల దిగుబడి వస్తోంది. ఇంత వస్తుందని అనుకోలేదు. మాసూళ్లు చేసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయడంతో ఊరటగా ఉంది. రైతుభరోసా కేంద్రాలు చొరవతో పని చేస్తున్నాయి.

– అన్నందేవుల చంద్రరావు,
చైర్మన్, ఆర్‌బీకే మండల కమిటీ,
కేశవరం, మండపేట

తొలకరి ఆశాజనకం



తొలకరి పంట ఆశాజనకంగా ఉంది. సీజన్ ఆరంభంలోను, సాగునీటి ఇబ్బందులు ఎదురైనా ఎమ్మెల్యే కురసాల కన్నబాబు చొరవతో సాగునీటి కష్టాలు తప్పాయి. కూలి రేట్ల నుంచి ఎరువులు, పురుగు మందుల రేట్లు పెరిగిపోవడంతో సార్వా పెట్టుబడులు పెరిగిపోయాయి. ఇంతవరకూ ఎకరాకు రూ.28 వేల పెట్టుబడి పెట్టాం. కోతలు, మాసూళ్లకు మరో రూ.ఐదారు వేలు అవుతుంది. ఎకరాకు 30 నుంచి 40 బస్తాల దిగుబడి వస్తుంది. హమాలీలు, రవాణా చార్జీలు కూడా ప్రభుత్వమే చెల్లిస్తూండటం సంతోషంగా ఉంది.

– రెడ్డి వీరభద్రరావు, రైతు, కరప



మండపేటలో కళ్లాల నుంచే ధాన్యం బస్తాలను ట్రాక్టర్లపై తరలిస్తోన్న రైతులు

న్యూస్‌రీల్

కౌడా ఛైర్‌పర్సన్‌గా చంద్రకళాదీప్తి

పదవీకాలం కొనసాగిస్తూ ఉత్తర్వులు



కాకినాడ: కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కౌడా) ఛైర్‌పర్సన్‌గా రాగిరెడ్డి చంద్రకళాదీప్తిని కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పురపరిపాలనశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2021–23 మధ్య కౌడా ఛైర్‌పర్సన్‌గా రాగిరెడ్డి చంద్రకళా దీప్తి రెండేళ్ళపాటు పనిచేశారు. ఆమె పదవీకాలం పూర్తయిన నాటి నుంచి (16–8–2023) నుంచి తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యే వరకు కౌడా ఛైర్మన్‌గా కొనసాగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేశారు. రాగిరెడ్డి చంద్రకళాదీప్తిని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అభినందించారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ విజయం కోసం, అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేసిన దివంగత రాగిరెడ్డి వెంకట జయరామ్‌కుమార్(ప్రూటీకుమార్) సేవలకు గుర్తుగా ఆయన సతీమణి చంద్రకళాదీప్తికి సముచిత స్థానం ఇచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు చెప్పారు. కౌడ ఛైర్‌పర్సన్‌ను ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, వైఎస్సార్‌సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, వ్యవసాయమార్కెట్‌కమిటీ ఛైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, పలువురు పార్టీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

దళారులను నమ్మి నష్టపోకండి

కాకినాడ సిటీ: ఘూసూలు చేసిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మద్దతు ధర విషయంలో నష్టపోవద్దని రైతులకు సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ డి.పుష్పమణి సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 3న సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవం రైతు భరోసా కేంద్రంలో కొనుగోలు ప్రారంభించామని చెప్పారు. ఐదు రోజులలోపు రూ. 2,46,242 రైతులకు జమ చేశామన్నారు. మద్దతు ధర సాధారణ రకం క్వింటాలుకు రూ.2,183, గ్రేడ్–ఏ రకం రూ.2,203గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

ఉపాధి హామీ పనుల్లో నాణ్యత

సామర్లకోట: ఉపాధి హామీ పనుల్లో మరింత నాణ్యత పెరిగే విధంగా చూడవలసిన బాధ్యత డ్వామా అధికారులపై ఉందని డ్వామా అదనపు కమిషనర్ అశోక్ కుమార్ అన్నారు. డ్వామా రాష్ట్ర స్థాయి రీసోర్సు పర్సన్లకు స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో మూడు రోజుల శిక్షణ ముగింపు సందర్భంగా శుక్రవారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్ని శిక్షణ ఇచ్చారు. ఉపాధి హామీ పథకంలో ప్రజలకు, రైతులకు ఉపయోగపడే పనులను గుర్తించాలని అశోక్‌కుమార్ సూచించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఉపాధి హామీ నిధుల్లో 50 శాతం కేటాయించే ముఖ్యమైన పనులను గుర్తించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో పనిని బట్టి కూలీ చెల్లిస్తారని ఉపాధి హామీ కూలీల్లో అవగాహన పెంచాలన్నారు. కొంతమంది పని చేయకుండా కూర్చుని ఉండటం వలన మిగిలిన వారు నష్ట పోయే అవకాశం ఉందని తెలుసుకునేలా చేస్తే అందరూ పని చేస్తారని చెప్పారు. అధికారులు తరుచూ ఉపాధి హామీ పనులను పర్యవేక్షించాలన్నారు. మస్టర్లను పరిశీలించాలన్నారు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థ కమిషనర్ కార్యాలయానికి చెందిన వీవీ కిరణ్, ఉపాధి హామీ రాష్ట్ర సంయుక్త కమిషనర్ మల్లెల శివప్రసాద్, ఫ్యాకల్టీలు ఎం గౌరీశంకర్, కె సుధీర్, ఈటీసీ సీనియర్ ప్యాకల్టీలు శ్రీదేవిలు శిక్షణ తరగతులు నిర్వహించారు.

'ఆడుదాం ఆంధ్రా'కు రిజిస్ట్రేషన్ చేసుకోండి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆడుదాం ఆంధ్రా జిల్లాస్థాయి పోటీలకు ఈ నెల 20వ తేదీ నుంచి క్రీడాకారులు వారి సమీప గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్టర్ చేసుకోవాలని డీఎస్‌ఏ సీఈఓ, చీఫ్ కోచ్ శ్రీనివాసకుమార్ పేర్కొన్నారు. వచ్చేనెల 15వ తేదీ నుంచి నిర్వహించే ఈ పోటీల నిర్వహణపై శాప్ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారని ఆయన పేర్కొన్నారు. హెచ్‌ఆర్ డాటా, గ్రౌండ్ డాటా, ఎండీఎస్ డాటా, ఆర్గనైజింగ్ కమిటీ, వలంటీర్లు, శిక్షణ, క్రీడా సామగ్రి, క్రీడాకారుల రిజిస్ట్రేషన్ తదితర అంశాలపై వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడారన్నారు. గ్రామ, వార్డు పరిధిలో 15 ఏళ్లు పైబడిన వారికి క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పేదల అభ్యున్నతే ధ్యేయం

- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- తొండంగిలో రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన



తొండంగిలో సీసీ రోడ్లు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా

తొండంగి: పేదల ఆర్థికాభివృద్ధి, అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. తొండంగిలో గురువారం రూ.2.20 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ పేదల జీవన ప్రమాణ స్థాయిని పెంచేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. అన్నివర్గాల అభ్యున్నతే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. నాడు–నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి పేదలకు కార్పొరేట్ విద్యను అందిస్తున్నారన్నారు. ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలంటే ప్రజలు మరోసారి జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలన్నారు. అనంతరం ఇటీవల బస్సు ప్రమాదంలో మరణించిన వీర్ల సతీష్ కుటుంబానికి రూ.2 లక్షలు (సొంత నిధులు) ఆర్థిక సహాయం అందించారు. అలాగే తొండంగిలో నిర్మిస్తున్న నూకాలమ్మ, పెద్దింట్లమ్మ ఆలయ నిర్మాణానికి తన వ్యక్తిగత నగదు రూ.7.5 లక్షలు విరాళం అందించారు. స్థానిక ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, మాజీ చైర్మన్ కొయ్యా మురళి, జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, పార్టీ మత్స్యకార విభాగం తుని నియోజకవర్గ కన్వీనర్ మేరుగు ఆనందహరి, పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గాబు రాజు, పార్టీ నాయకులు అంగుళూరి సుశీల, దడాల విజయ్, తహసీల్దార్ జి.సుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ పసపులేటి సతీష్, పార్టీ మండల కన్వీనర్ బద్ది నూకరాజు, యూత్ కన్వీనర్ ఆరుమిల్లి ఏసుబాబు చౌదరి, మండల సమన్వయ కమిటీ సభ్యుడు బెక్కం చంద్రగిరి, సర్పంచ్ సోమాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ కృతికా శుక్లా



జాతీయ గ్రంథాలయ వారోత్సవాల వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో అన్ని గ్రంథాలయాల్లో ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నారు. కలెక్టర్ కృతికా శుక్లా, గ్రంథాలయ అధికారులతో కలిసి 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్‌ను కలెక్టరేట్‌లో వారు ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ సందర్భంగా నిర్వహించే వ్యాస రచన, చిత్రలేఖనం, క్విజ్ తదితర పోటీల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు. ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వివిఎల్ఎన్ఎస్‌వీ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ ఎల్.వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జి డిప్యూటీ లైబ్రేరియన్ కె.కిశోర్, లైబ్రేరియన్ ఎం.శ్రీనివాసరావు, సలాది రాజు, డి రవికుమార్ పాల్గొన్నారు.

స్వీపరు మృతిపై అసత్య ప్రచారాలు మానుకోవాలి

పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి

పెద్దాపురం: అన్నవరం దేవస్థానం ఉద్యోగి మృతిపై సోషల్‌మీడియాలో వస్తున్న వదంతులను నమ్మవద్దని పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి తెలిపారు. శుక్రవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. కాంట్రాక్ట్ స్వీపర్‌గా పనిచేస్తున్న పలివెల సింహాచలం గత నెల 11న కాకినాడ జీజీహెచ్ నుంచి డిశ్చార్జి అయ్యి మర్నాడు తెల్లవారుజామున ఇంటిలో మృతి చెందాడన్నారు. కానీ నాటు సారా ముఠా కొట్టి చంపిందని, మూర్ఛవ్యాధితో అతడు చనిపోయినట్లు పోస్ట్‌మార్టం రిపోర్టులున్నాయనే కొందరి పోస్టుల్లో వాస్తవం లేదన్నారు. ఇంట్లో తన తండ్రి చనిపోయాడని సింహాచలం కుమార్తె నూకరత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. అనారోగ్య కారణాల వల్ల మర్మావయవం ద్వారంలో రక్తం గడ్డకట్టి ఉందని నిర్ధారిస్తూ ఉన్న పోస్టు మార్టం రిపోర్ట ఫోరెనిక్స్ ల్యాబ్‌కు పంపించామన్నారు. మృతి చెంది నెల రోజులవుతుంటే సహజ మరణం కాదంటూ సోషల్ మీడియాలో తప్పుడు వదంతులు సృష్టించడం సరి కాదన్నారు. విజయవాడ ల్యాబ్ నుంచి రిపోర్టు రాగానే తప్పుడు పోస్టింగ్‌లు పెడుతున్న వ్యక్తులపై చర్యలు తప్పవని డీఎస్పీ స్పష్టం చేశారు. ఇకనైనా తప్పుడు ప్రచారాలు మానుకోకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రూ.4.78 లక్షల విలువైన రేషన్ బియ్యం పట్టివేత

జగ్గంపేట: అక్రమంగా తరలిస్తున్న రూ.4.78 లక్షలు విలువైన 3140 కేజీల రేషన్ బియ్యాన్ని రాజమహేంద్రవరం విజిలెన్స్ అధికారులు శుక్రవారం సీజ్ చేసి ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. జగ్గంపేట సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్ జి.మురళీకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం కిర్లంపూడి మండలం గోనాడకు చెందిన నల్లంశెట్టి లక్ష్మీనారాయణ పరిసర గ్రామాల్లో తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి జగ్గంపేట మండలం మల్లిసాలలోని ఇటుక బట్టీల్లో పనిచేసే కార్మికులకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నాడు. కాగా శుక్రవారం గోనాడ నుంచి మల్లిసాలకు వ్యాన్‌లో రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా జగ్గంపేటలో అధికారులు తనిఖీ చేసి పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని జగ్గంపేట ఎంఎస్ఓ పాయింట్‌కు తరలించారు. దీనిపై జగ్గంపేట ఎస్సై నాగార్జునరాజు కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారి శ్రీనివాసరెడ్డి, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చొల్లంగిలో రోడ్డు ప్రమాదం

- ఆటోను ఢీకొన్న కారు
- ఆ కారును ఢీకొన్న మరో ఆటో
- 14 మందికి గాయాలు



ఆస్పత్రి వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



చొల్లంగి వద్ద ఆటోను ఢీకొన్న కారు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216పై చొల్లంగి వద్ద శుక్రవారం జరిగిన ప్రమాదంలో 14 మంది తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, కోరంగి పోలీసుల కథనం ప్రకారం.. అమలాపురం నుంచి కాకినాడ వైపు వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొంది. అదే సమయంలో కాకినాడ వైపు నుంచి చొల్లంగిపేట వెళ్తున్న మరో ఆటో ఆ కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు ఆటోల డ్రైవర్లతో పాటు ఆయా ఆటోల్లోని 10 మంది ప్రయాణికులు, కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. తాళ్లరేవు మండలం చొల్లంగిపేటకు చెందిన ఆటో డ్రైవర్లు ఈర్ల బాబూరావు, తులసి శ్రీనివాసరావుతో పాటు కోనాడ కామేశ్వరి, శ్రీకోటి లక్ష్మి, కోనాడ సత్యవతి, నీలపల్లి లక్ష్మి, రామిశెట్టి ఎల్లారి, సోది పద్మ, నీలపల్లి దేవి, గంపల నూకరత్నం; తాళ్లరేవుకు చెందిన మేకల కస్తూరి, మేకల ఆనంద్; కారులో ప్రయాణిస్తున్న దొంగ రామచంద్రరావు, సునీత దంపతులు గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్సులలో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చేపల విక్రయానికి వెళ్లి వస్తూ..

చొల్లంగిపేట గ్రామానికి చెందిన మహిళలు ప్రతి రోజూ మత్స్య ఉత్పత్తుల విక్రయానికి ఆటోల్లో సామర్లకోట, పెద్దాపురం వెళ్లి వస్తూంటారు. రోజూ మాదిరిగానే ఒకే ఆటోలో వెళ్లిన ఎనిమిది మంది మత్స్యకార మహిళలు తిరిగి స్వగ్రామానికి తిరిగి బయలుదేరారు. మరో పది నిమిషాల్లో ఇంటికి చేరుకుంటారనగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఏడాది మే నెలలో కోరంగి పంచాయతీ సుబ్బారాయుని దిమ్మ వద్ద ఒక ఆటోను ప్రైవేటు బస్సు ఢీకొని ఎనిమిది మంది మృతి చెందిన విషయం తెలిసిందే. తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా ఆటోవాలాల తీరు మారకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

కల..కసి..కలగలసి..

మంచి ప్యాకేజీతో వచ్చిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కాదనుకున్నాడు. ప్రభుత్వ రంగంలో ప్రజాసేవతో వీలున్న కొలువు కావాలనుకున్నాడు. వరుస పరాజయాలు ఎదురైనా ధిక్కరించాడు. లక్ష్య సాధనకు పరాక్రమించాడు. ఏ దశలోనూ నిరాశను దరి చేరనీయరాదనుకున్నాడు. ఆత్మ విశ్వాసమే మార్గమని విశ్వసించాడు. ఫలితంగా ఈ ఏడాది నాలుగు నెలల వ్యవధిలో నాలుగు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. చివరకు గ్రూప్–1 ద్వారా డీఎస్పీ ఉద్యోగంలో చేరాలని నిర్ణయించుకున్నాడు ఓ హెడ్ కానిస్టేబుల్ కుమారుడు చుక్కల సూర్యకుమార్. అయినప్పటికీ అంతిమ లక్ష్యం .. సివిల్స్‌పై గురి వీడలేదు. నిరంతర పరిశ్రమకు చిరునామాగా నిలిచే సూర్యకుమార్‌ను ఒకసారి పలకరిస్తే..

– సాక్షి డెస్క్, రాజమహేంద్రవరం

పేరు	: చుక్కల సూర్యకుమార్
తండ్రి	: వెంకటరమణ, హెడ్ కానిస్టేబుల్
తల్లి	: లక్ష్మి, గృహిణి
చదువు	: బీటెక్ (ట్రిపుల్ ఐటీ, నూజివీడు)
ఎంపిక	: గ్రూప్-1లో డీఎస్పీ (జైళ్లు)
ప్రస్తుతం ఉంటున్నది	: వేమగిరి (తూర్పు గోదావరి)

లక్ష్యం నిర్ణయించుకుని శ్రమించాలి

జీవితంలో ఏం చేయాలనుకుంటున్నామో మన సామర్థ్యానికి అనుగుణంగా ముందుగానే లక్ష్యం నిర్ణయించుకోవాలి. ఏదైనా సాధించాలంటే కష్టం తప్ప మరో మార్గం ఉండదని తెలుసుకోవాలి. ఒడుదొడుకులు ఎదురైనా ఏ సమయంలోనూ ఆత్మ విశ్వాసాన్ని దూరం చేసుకోకూడదు. నేనైతే ఈ పరీక్షల ప్రిపరేషనులో అన్ని సరదాలు, షికారులు వదులుకున్నాను. ఫెయిల్యూర్స్ వస్తున్నా నిరాశ పడకుండా ప్రయత్నం కొనసాగించాలి. ప్రణాళిక ప్రకారం ప్రిపేరైతే తప్పకుండా విజయం సాధిస్తాం.

– చుక్కల సూర్యకుమార్



- డీఎస్పీగా ఎంపికైన హెడ్ కానిస్టేబుల్ కుమారుడు
- వరుస వైఫల్యాలను అధిగమించి సాధించిన వైనం
- ఈ ఏడాది నాలుగు నెలల్లో నాలుగు కొలువులు
- అయినా సివిల్స్ లక్ష్యంగా శ్రమిస్తున్న యువకుడు



కుటుంబ సభ్యులతో సూర్య కుమార్

మాది మధ్య తరగతి కుటుంబం. సొంత ఊరు కాకినాడ జిల్లా తొండంగి మండలం పైడికొండ. నాన్న వెంకట రమణ కడియం పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్. అమ్మ లక్ష్మి గృహిణి. తమ్ముడు గోవిందరాజు, అక్క స్వాతి ఉన్నారు. తమ్ముడు ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదివి ప్రస్తుతం ఢిల్లీ ఎయిమ్స్‌లో గ్యాస్ట్రో ఎంట్రాలజీలో సూపర్ స్పెషాలిటీ చేస్తున్నాడు. నాకు టెన్త్‌లో మంచి మార్కులొచ్చాయి. స్టేట్‌లో ఆరో ర్యాంకు వచ్చింది. ఆ మార్కులు ఆధారంగా 2008లో నూజివీడులోని ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. అక్కడ నా చదువుకు గట్టి పునాది పడింది. ఇంటర్‌లో కూడా స్టేట్ సెకండ్ ర్యాంక్ వచ్చింది. యూనివర్సిటీ స్థాయిలో టాప్ టెన్‌లో ఒకడిగా నిలిచాను. 2014లో బీటెక్ అయ్యాక ఇన్ఫోసిస్ ఉద్యోగానికి క్యాంపస్‌లో సెలక్టయ్యాను. అప్పట్లోనే నాకు వార్షిక జీతం రూ.35 లక్షలు. అందులో కొనసాగి ఉంటే ఇప్పుడు రూ.కోటిన్నరకు చేరేవాడిని.

త్రుటిలో చేజారిన అవకాశాలు

ఎక్కువ జీతం.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం నాకు సంతృప్తి కలిగించలేదు. అందులో సంతోషంతో ఇమడలేకపోయాను. రెండేళ్లు పని చేశాను. కానీ పబ్లిక్ సర్వీసుతో సంబంధమున్న ప్రభుత్వ ఉద్యోగం చేయాలనే కోరిక నాలో బలంగా నాటుకుపోయింది. ఇదే విషయాన్ని నాన్నతో చెప్పాను. ఆ ఉద్యోగానికి రాజీనామా చేశాను. మా కుటుంబ ఆర్థిక పరిస్థితులకు ఇది ఇబ్బందికరమైనా నాన్న నన్ను ప్రోత్సహించారు. ఢిల్లీలో సివిల్స్ కోచింగుకు జాయినయ్యాను. 2017–20 మధ్య నాలుగుసార్లు రాశాను. ఇంటర్వ్యూ దశకు చేరుకోలేకపోయాను. ఇదే సమయంలో ఇతర పోటీ పరీక్షలపై దృష్టి పెట్టాను. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్, ఎస్సెస్సీ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ పరీక్షల్లో తుది జాబితాలో మిస్సయ్యాను. 2020 గ్రూప్–2లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో అవకాశం పోయింది. అదే ఏడాది గ్రూప్–1 మెయిన్‌కు అర్హత సాధించినా ఇంటర్వ్యూ పోయింది. ఎస్సెస్సీ సీజీఎల్, నాబార్డు, ఆర్‌బీఐ.. ఇలా నాలుగైదు పరీక్షలు పాసైనా త్రుటిలో విజయం దూరమయ్యేది. ఈ దశలో మానసిక దృఢత్వం కోల్పోతానేమోనని సంశయించాను. అయినా పట్టుదలతో కష్టపడేవాడిని. నిరాశ చెందేవాడిని కాదు.

అంతిమ లక్ష్యం సివిల్స్

2023– ఈ ఏడాది నా జీవితంపై చాలా మంచి ప్రభావం చూపించింది. వరుస వైఫల్యాల నుంచి గట్టెక్కించేలా చేసింది. నాలుగు నెలల వ్యవధిలో నాలుగు ఉద్యోగాలు వచ్చాయి. దేవదాయ శాఖలో ఈఓ పోస్టుకు ఎంపికయ్యాను. కాగ్ అకౌంటెంటుగా సెలక్టయ్యాను. సరదాగా రాసిన గ్రూప్–4 ఉద్యోగమూ వచ్చింది. గ్రూప్–1లో విజేతగా నిలిచాను. జైల్స్ డీఎస్పీగా ఎంపికయ్యాను. ప్రస్తుతానికి దేవదాయ శాఖలో ఈఓ శిక్షణ పొందుతున్నా.. వచ్చే జనవరిలో డీఎస్పీ ట్రైనింగ్ ఆర్డర్ రాగానే వెళ్లాలని నిర్ణయించుకున్నాను. డీఎస్పీ అయినా నా జీవిత లక్ష్యం మాత్రం సివిల్ సర్వీసెస్‌కు ఎంపిక కావాలన్నదే. ఎలాగైనా సాధిస్తానని నమ్మకం ఉంది.

ఘనంగా మహాశాంతి హోమం



స్వామి వారి చక్రస్నానంలో భక్తుల కోలాహలం

- కోలాహలంగా చక్రస్నానం
- వాడపల్లిలో ముగిసిన వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు

ఆత్రేయపురం: వాడపల్లి దివ్యక్షేత్రంలో శ్రీదేవి, భూదేవీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ నెల 2న ఈ ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ ఉత్సవాల సందర్భంగా స్వామి వారిని దర్శించుకునేందుకు లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. బ్రహ్మోత్సవాల చివరి రోజైన శుక్రవారం ఉదయం స్వామి వారికి తీర్థపు బిందె, సుప్రభాత సేవ, నిత్యహోమాలు, ప్రత్యేక పూజలు, విష్వక్సేన పూజ, పుణ్యాహావాచనం, మహా శాంతి హోమం, మహా పూర్ణాహుతి, చక్రస్నానం, అవభృధ స్నానం, ధ్వజారోహణ.. సాయంత్రం మహదాశీర్వచనం, ఏకాంత సేవ తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారికి ప్రముఖ పారిశ్రామికవేత్త మేడపాటి శ్రీనివాసరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు దంపతులు పట్టు వస్త్రాలు అందజేశారు. కుటుంబ సమేతంగా హోమం పూర్ణాహుతిలో పాల్గొని, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మోత్సవ క్రతువులను ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు ఆధ్వర్యాన వేద పండితులు, అర్చకులు నిర్వహించారు. స్వామివారిని పట్టు వస్త్రాలు, రంగురంగుల పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారికి భక్తులు ఆర్జిత సేవలు నిర్వహించుకున్నారు.

25 టన్నుల బియ్యం పట్టివేత

కొవ్వూరు: అక్రమంగా తరలిస్తున్న 25 టన్నుల రేషన్ బియ్యాన్ని పౌర సరఫరా అధికారులు గురువారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్ జి.బాపిరాజు శుక్రవారం ఈ వివరాలు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. తెలంగాణలోని ఖమ్మం నుంచి కాకినాడ పోర్టుకు లారీలో భారీగా రేషన్ బియ్యం తరలిస్తున్నారు. దీనికి సంబంధించి ఎటువంటి ఆధారాలూ చూపకపోవడంతో బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, నిడదవోలులోని పౌర సరఫరాల గోదాముకు తరలించారు. ఈ సందర్భంగా కృష్ణా జిల్లా వత్సవాయి మండలం లింగాల గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ కం ఓనర్ షేక్ నాగూర్ మీరా, బియ్యం పంపిన వ్యాపారి ఖమ్మం నగరానికి చెందిన ఎ.వెంకటేశ్వరరావుపైన 6ఏ కేసు నమోదు చేశారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.10 లక్షలు ఉంటుందని నిర్ధారించారు. లారీతో కలిపి పట్టుకున్న సొత్తు రూ.23 లక్షలని బాపిరాజు తెలిపారు.